



అమలాపురంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విద్యుత్ అలంకరణ

నేటి నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- అమలాపురంలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

విజయదశమి నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలను 11రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విజయదశమి ఉత్సవాలకు చారిత్రాత్మక ప్రాచుర్యం ఉంది. ఉభయ రాష్ట్రాలతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భారీగా ప్రజలు వచ్చి ఆయా కమిటీలు నిర్దేశించిన తేదీల్లో జరగనున్న ఉత్సవ వేడుకలను తిలకిస్తారు. ముఖ్యంగా జిల్లా పరిధిలో ద్రాక్షారామలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవస్థానం, వాడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు మిగిలిన ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అధికారులు, పాలకవర్గ కమిటీలు, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. అమలాపురం పట్టణంలో ప్రముఖంగా జరిగే శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భారీగా ఏర్పాట్లు చేశారు. శ్రీదేవి అమ్మవారి సెంటర్‌లో నలుమూలలా భారీ సెట్టింగులతో పందిళ్లు వేసి విద్యుద్దీపాలంకరణలతో అలంకరించారు. సోమవారం నుంచి ఉత్సవాల ప్రారంభానికి ఆలయ కమిటీ సన్నద్ధమైంది. పట్టణంలో మార్కెట్ వద్ద అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి మెయిన్‌రోడ్డుపై భారీ విద్యుద్దీపాలంకరణలు చేశారు. విజయదశమి పర్వదినాన అమలాపురంలో తొమ్మిది వీధులకు చెందిన చెడీ తాలింఖానా ఉత్సవాలు అక్టోబరు 2న ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఇలా జిల్లా నలుమూలల ఉన్న ప్రసిద్ధ ఆలయాలు, ముఖ్య ప్రాంతాల్లో విజయ దశమి ఉత్సవాలను భారీగా జరిపేందుకు కమిటీలు సమాయత్తమయ్యాయి. సోమవారం నుంచి విజయదశమి పర్వదినాలు ముగిసే వరకు జిల్లావ్యాప్తంగా ఎస్పీ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలతో డీఎస్పీలు, సీఐలు సంప్రదింపులు చేస్తూ సూచనలిస్తున్నారు.



ట్యాక్స్ థ్యాంక్స్



దసరా.. ధమాకా



దసరా వచ్చిందంటే ఆ సరదాయే వేరు.. విజయ దశమి విజయాలనిస్తుందని అందరి నమ్మకం.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది.. దసరాలో కార్లు, బైక్‌లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు తదితర వస్తువులు కొనుగోలు చేయడం అలవాటు. ఏదో ఒక కొత్త వస్తువులను కొనుగోలు చేయడం సెంటిమెంట్‌గా భావిస్తారు.. దసరాలో కొంటే కలిసొస్తుందని నమ్మకం..సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి.. అంతే కాకుండా కేంద్రం ప్రకటించిన జీఎస్టీ తగ్గుదల సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. దీంతో కొనుగోలుదారులకు నిజంగానే దసరా పండుగ తేనుంది. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ధరాభారం తగ్గింది. ఈ నెల 22 నుంచి అధికారికంగా వివిధ వస్తువులు ధరలు తగ్గనున్నాయి. ఏసీలపై రూ. 3 వేల నుంచి రూ.5 వేలు, ఫ్రిడ్జ్‌లపై రూ.2 వేలు, టీవీలపై గరిష్ఠంగా రూ.5 వేలు, కార్లపై రూ.లక్ష నుంచి రూ.3లక్షలు, బైక్‌లపై రూ.10 వేల నుంచి రూ.30 వేల జీఎస్టీ తగ్గిన దరిమిలా మార్కెట్‌కు కళ రానుంది. నేటి నుంచి దశమి పర్వదినం మొదలు కావడం దశమి అనంతరం దీపావళి పండుగ ఉండడంతో వ్యాపార వర్గాలు తమ తమ వ్యాపార సముదాయల్లో స్టాక్ పూర్తి స్థాయిలో ఉంచారు.

రాజమహేంద్రవరానికి చెందిన గణేష్ గత నెలలో ఒక కారు కొనుగోలు చేశాడు.. ఖరీదు రూ.13.80 లక్షలు.. అప్పట్లో కార్లపై 28 శాతం జీఎస్టీ ఉండేది. దీంతో అతను జీఎస్టీ కింద అప్పట్లో రూ.2.50 లక్షలు చెల్లించాడు.. రేపటి నుంచి జీఎస్టీ 18 శాతానికి తగ్గనుంది..అంటే 10 శాతం పడిపోయింది. అతను ఇప్పుడు కారు కొంటే 1,03,800 తగ్గనుంది. ఒక కారుకు రూ.లక్ష తగ్గడం అంటే మామూలు విషయం కాదు కదా.. అందుకే కార్లు కొనుగోలుదారులు జీఎస్టీ తగ్గుదలకు ఎదురుచూస్తున్నారు..

రాజమహేంద్రవరానికి చెందిన కిరణ్ ప్రతి నెలా మందులకు రూ.10 వేలు ఖర్చుచేస్తాడు. గతంలో మందులపై జీఎస్టీ కింద 5 నుంచి 12 శాతం చెల్లించేవాడు. మందులపై జీఎస్టీ తొలగించడంతో ఇప్పుడు సుమారు రూ.వెయ్యి వరకూ కలిసి రానుంది.గోదావరి జిల్లాలో షుగర్, బీపీ, డయాలసిస్, కేన్సర్ రోగులు అధికం.మందులపై జీఎస్టీ ఎత్తివేయడంతో ప్రయోజనం కలగనుంది. మందులపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. గతంలో 5 నుంచి 12 శాతం ఉండేది. దీంతో వీటి ధరలు బాగా తగ్గనున్నాయి.
- రాజమహేంద్రవరం/సిటీ

మార్కెట్ డల్‌గా మారింది..గత 20 రోజులుగా ఎక్కడా కొనుగోళ్లు సాగలేదు.. షాపింగ్ మాల్స్ వెలవెలబోయాయి.. కార్ల షోరూంలు కస్టమర్లు రాక కళతప్పాయి.. ఎందుకంటే నిన్నటి వరకూ మార్కెట్‌లో ఏవస్తువు కొన్నా ఎంఆర్‌పీకి అదనంగా వస్తు-సేవల పన్ను పేరిట (జీఎస్‌టీ) అదనంగా చెల్లించాల్సిందే. నిత్యావసరాలపై పన్ను బాదుడు ఉండేది.దీంతో జనం నిరాశ వ్యక్తం చేసేవారు.అయితే కేంద్రం 2.0 జీఎస్టీ విధానం పేరిట కొన్ని వస్తువులను మినహాయించి ప్రజలకు దసరా కానుక అందించింది.గతంలో జీఎస్టీ స్లాబ్‌లు 5, 12, 18, 28 శాతంగా ఉండేవి. ప్రస్తుతం కేవలం 5,18 స్లాబ్‌లు మాత్రమే మిగిలాయి..దీంతో గృహోపకరణాలు, కార్లు,నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గించడంతో ధరలు తగ్గనున్నాయి.ఈ నేపథ్యంలో జీఎస్టీ తగ్గింపునకు జనం వెయిట్ చేస్తున్నారు. సోమవారం నుంచి కొనుగోలుదారులతో షోరూమ్‌లు, మార్కెట్ కళకళలాడనుంది.

బీమా.. రంగం..

మరోవైపు బీమా రంగం వ్యాపారం ఊపందుకుంటుం దని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఎల్ఐసీతో పాటు ఆరోగ్య బీమా,ఇతర బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా తొలగించారు. ఆయా కంపెనీలు తమ ఏజెంట్లను అప్రమత్తం చేసి పోత్సాహకాలు ప్రకటిస్తూ అధిక సంఖ్యలో పాలసీలు రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. సోమవారం ఎల్ఐసీ ఏజెంట్లకు పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పలు బీమా కంపెనీలు సోమవారం పనిఒత్తిడిని తట్టుకోవడానికి శని, ఆదివారాలు సైతం కార్యకలాపాలు కొనసాగించారు. దీంతో బీమా పాలసీలు సైతం పెరగనున్నాయి. ఎందుకంటే నిన్నటి వరకూ 18 శాతం జీఎస్టీ ఉండేది.

జీఎస్టీ సంస్కరణలు అదరహో

- నేటి నుంచి జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గుదల
- 5,18 శ్లాబ్‌లకే పరిమితం
- 20 రోజులుగా పడిపోయిన అమ్మకాలు
- ఖాళీగా షాపింగ్ మాల్స్..షోరూమ్‌లు
- పుంజుకోనున్న అమ్మకాలు,కొనుగోళ్లు
- భారీగా తగ్గనున్న కార్లు, బైక్‌ల ధరలు
- నిత్యావసరాలపైనా తగ్గింపు
- కొనుగోలుదారుల ఆనందం

విద్యార్థుల సామగ్రి..మందులపై ఉపసంహరణ

విద్యార్థులు ఉపయోగించే వస్తువులపై జీఎస్టీ మినహాయించారు. కొన్నింటిపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. మందులపై కూడా జీఎస్టీ ఉపసంహరణ రోగులకు వరం కానుంది. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్, డయా గ్నోస్టిక్ కిట్లు, సర్జికల్ కిట్లపై 12 శాతంగా ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో వ్యవసాయమే జీవనాధారం. రైతులు నీటిపారుదల శాఖలో ఉపయోగించే ట్రాక్టర్లు తదితర యంత్రాలపై గతంలో 12 శాతం జీఎస్టీ ఉండేది. దానికి 5 శాతానికి పరిమితం చేశారు. టెలివిజన్ సెట్లు (ఎల్‌సీడీ/ ఎల్ ఈడీ) మోనిటర్లు,ప్రొజెక్టర్లు, ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉండేది.దానిని 18 శాతానికి పరిమితం చేశారు.సోలార్ వాటర్ హీటర్,సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు. గృహనిర్మాణ సామగ్రిపై జీఎస్టీని తగ్గించారు. గృహోపకరణాలపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత సంరక్షణకు రోజువారి వాడే వాటిపై 12 శాతం ఉండగా 5 శాతానికి పరిమితం చేశారు.

అతిథులకు ఆనందమే

గోదావరి పుష్కరాలకు రెండేళ్లు ముందే అతిథ్యసేవలపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో హోటల్స్, లాడ్జిలు చిన్నపెద్దా కలిపి సుమారు రెండు వేలు పైబడి ఉన్నాయి.వాటిలో 5 స్టార్, త్రీస్టార్, హోటల్స్ కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం ,సామర్లకోట, తుని,అన్నవరంలో ఉన్నాయి. దిండి,రంపచోడవరం, మారేడుమిల్లి, యానాంలలో హోటల్స్, రిసార్ట్స్ ఉన్నాయి. వాటిలో సోమవారం నుంచి 5 శాతమే జీఎస్టీ వసూలు చేస్తారు.

అవగాహనకు చర్యలు

ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా వాణిజ్య పన్నులశాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఏసీటీవో, సీటీవోలు తమ స్థాయిలో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రాధాన్యతల వారీగా 16 రంగాల్లో ఫ్లయర్స్ (పిక్టోరియల్)గ్రాఫ్‌లను ప్రధాన కూడళ్లలో ప్రదర్శించి వాటిని చూసిన వెంటనే ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో సిద్ధం చేస్తున్నారు. మరోవైపు పంచాయతీరాజ్, రెవెన్యూ, గ్రామసచివాలయాల ఉద్యోగులతో కలిసి ప్రజల్లోకి వెళ్లనున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేపట్టిన చొరవతోనే జీఎస్టీ ధరాభారం తగ్గిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ నాయకులు కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శన నిర్వహించనున్నారు.

భీమేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

- నేటి నుంచి మాణిక్యాంబ సన్నిధిలో విశేష పూజలు



ద్రాక్షారామ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అష్టా దశ శక్తిపీఠాల్లో ద్వాదశశక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న మాణిక్యాంబ అమ్మ వారి సన్నిధిలో ఈనెల 22 సోమవారం నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 22వతేదీ నుంచి ఉదయం 6.16 గంటలకు కలశస్థాపనతో దసరా ఉత్సవాలు ప్రారంబిస్తారు. వాడ్రేవు సుందర రత్నాకరరావు, ఆలయ అర్చకులు కలశస్థాపనలో పాల్గొంటారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం8 గంటల నుంచి 11 వరకు మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో వేదపారాయణ ప్రయుక్త, దేవీ బాగవతం, చండీ, సప్తశతీ, సుందరకాండ, మన్యుసూక్త, లలితా పారాయణలు, సూర్యనమస్కారాలు, నవగ్రహ జపాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 వరకు దేవులపల్లి ఫణిరామకృష్ణశర్మలతో శ్రీచక్రనవావర్ణార్చన, మధ్యాహ్నం 3.30గంటల నుంచి 5.30 గంటల వరకు కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు అమ్మవారికి సువర్ణ, రజిత పుష్పార్చన నిర్వహిస్తారు. ఈనెల 29న మూలా నక్షత్రం పురస్కరించుకుని సరస్వతిపూజ, అక్టోబరు 2న విజయదశమి పురస్కరించుకుని రాత్రి 6.45గంటలకు శమీపూజ వేగాయమ్మపేటలోనిర్వహిస్తారు.4న ఉదయం పూర్ణాహుతి నిర్వహిస్తారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంటదుర్గా భవానీ తెలిపారు.

నిత్యం నరకమే!



తాపేశ్వరం-ద్వారపూడి మధ్య కల్వర్టుల వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు వద్ద విరిగిపోయిన ఆటోచక్రం

- తాపేశ్వరం-ద్వారపూడి మధ్య రోడ్డులో కల్వర్టులు పూర్తయ్యేదెప్పుడో?
- బిల్లులు వస్తే కానీ పనులు చేయలేమంటూ చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారిన రహదారి

మండపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆ రహదారి నిత్యం నరకప్రాయం.. గతుకులతో ప్రయాణికులకు కన్నీళ్లు పెట్టించింది. గత ప్రభుత్వహయాంలో నిర్లక్ష్యానికి గురై ఎట్టకేలకు రహదారి నిర్మాణం జరిగింది. కానీ, కల్వర్టులు నిర్మించలేదు. ఇంకేముంది అదే నరకంగా మారింది.జిల్లాలోని మండపేటలో తాపేశ్వరం- ద్వారపూడి మధ్య రహదారిలో కల్వర్టుల నిర్మాణం పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో సెంట్రల్ రోడ్డు ఫండ్ నిధులు రూ.25 కోట్లతో రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2019లోనే అనుమతులు ఇచ్చింది. కానీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు పోరుతో ఎట్టకేలకు 2023-24 సంవత్స రంలో రెండు సీఆర్ఎఫ్ పనులకు టెండరు వేసిన గుత్తేదారుడు రోడ్డుపనులు పూర్తిచేశాడు. రామచంద్రపురం-లొల్ల రోడ్డుకు 8 కిలోమీటర్లకు సంబంధించి ఒక ప్యాకేజీ, మండపేట మండలం తాపేశ్వరం-ద్వారపూడి మధ్య ఆరు కిలోమీటర్ల మేర ఒక ప్యాకేజీతో రెండు పనులకు సంబంధించి ఒకటే టెండరు పిలిచారు. పనులను 2023-24 సంవత్సరాల్లో గుత్తేదారుడు రోడ్డు పనులు పూర్తి చేశాడు. మండపేట మండలం తాపేశ్వరం-ద్వారపూడి మధ్య సీసీ రోడ్డు, తాపేశ్వరం-ఇప్పనపాడు మధ్య 1.6 కిలోమీటర్ల మేర మిగిలిన తారురోడ్డు వేశారు. ఈ మధ్యలో నాలుగు కల్వర్టుల నిర్మాణం పూర్తిచేయలేదు. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతోపాటు మరో కిలోమీటరు మేర తాపే శ్వరం-ఇప్పనపాడు మధ్య సీసీ డ్రైన్ పనులు ప్రారంభించలేదు. రామచంద్రపురానికి సంబంధించి 8కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. ఒక్క కల్వర్టు నిర్మాణం చేపట్టలేదు. రూ.11కోట్ల మేర బిల్లు చెల్లించకపోవడంతో పనులు చేయలేకపోతున్నట్టు కాంట్రాక్టర్ చెప్తున్నాడు. దీంతో పనులు ఏడాదిన్నరగా ముందుకు సాగడంలేదు.

ఇతరత్రా సమస్యలు కూడా..

తాపేశ్వరం, ద్వారపూడి మధ్య వేసిన సీసీ రోడ్డు పగుళ్లు తీసి బీటలువారింది. రోడ్డు మార్జిన్‌లు సక్రమంగా లేకపోవడం, నాలుగు కల్వర్టు పనులు చేపట్టకపోవడంతో కల్వర్టులు-రోడ్డుకు మధ్య వ్యత్యాసం కారణంగా గోతులమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదేరోడ్డు విషయంలో గతంలో ధర్నాలు చేసిన నేతలు ఇప్పుడు నోరువిప్పకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుల పనులు పూర్తి చేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. తాపేశ్వరం, ద్వారపూడి మధ్య కల్వర్టులు, రోడ్డు, డ్రైన్ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంపై రామచంద్రపురం ఆర్అండ్‌బీ డీఈఈ సూర్యనారాయణను వివరణ కోరగా పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వంనుంచి రూ.11కోట్లు బిల్లులు రావాల్సి ఉందని, దానివల్ల పనులు చేసేందుకు ముందుకు రావట్లేదని, నిధులు విడుదల కాగానే పనులు చేపడతామని తెలిపారు.

వినూత్నరీతిలో పోరాటం

తాపేశ్వరం,ద్వారపూడి మధ్య కల్వర్టుల వద్ద ప్రమాదకరంగా మారిన గోతులను పూడ్చాలని మండపేటకు చెందిన సామాజిక ఉద్యమ కార్యకర్త బీఎస్ఎస్ మూర్తి వినూత్న రీతిలో పోరాటం ప్రారంభించారు. ఆయన ఇదే రోడ్డుపై గతంలో రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. ఇప్పుడు తాపేశ్వ రం-ద్వారపూడి రోడ్డు దుస్థితిని వివరిస్తూ.. ఫొటోలను కూడిన కరపత్రాన్ని తన కారుకు అంటించి ప్రచారం చేస్తున్నారు.



రోడ్డు దుస్థితిపై ప్రచురించిన కరపత్రాన్ని కారుకు అంటించి అవగాహన కల్పిస్తున్న మూర్తి

జిల్లా ప్రజలు, అధికారుల సహకారం

ఎప్పటికీ మరువలేనిది

- ఘన వీడ్కోలు పలికిన అధికారులు
- పోలీసు అభివృద్ధి పనుల్లో బంగారు బాట వేశారు: జిల్లా ఎస్పీ మీనా

అమలాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాను పనిచేసిన కాలంలో ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని ఎస్పీగా పనిచేసి పల్నాడు జిల్లాకు బదిలీ అయిన బి.కృష్ణారావు అన్నారు. తన జీవితంలో జిల్లాలో పనిచేసిన కాలం ఒక మధురస్మృతిగా నిలుస్తుందన్నారు. తన సర్వీసులో కోనసీమ జిల్లాను శాంతి భద్రతల విషయంలో అగ్రగామిగా నిలిపానన్నారు. ఇక్కడ ప్రజలు సౌమ్యులని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుశాఖ చేపట్టిన చర్యలకు ప్రజలు తమవంతు సహకారం అందించారని ఆయన అన్నారు. శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇక్కడ పోలీసు అధికారులు అంకిత భావంతో పనిచేసినందుకు పేరుపేరున వారికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎస్పీగా పనిచేసి పల్నాడు జిల్లాకు బదిలీ అయిన కృష్ణారావుకు ఆదివారం అమలాపురం ఇందుపల్లిలోని ఏ1 కన్వెన్షన్ హాలులో పోలీసు సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రస్తుత జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పాల్గొని కృష్ణారావు సేవలను ప్రశంసించారు. జిల్లా శాంతి భద్రతల విషయంలో పోలీసు యంత్రాంగానికి అవసరమైన అభివృద్ధి పనుల్లో బంగారు బాట వేశారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, ఏవోతోపాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు భారీగా హాజరయ్యారు. తొలుత ఎస్పీ కృష్ణారావు ఎక్కిన వాహనాన్ని పోలీసు అధికారులు తాళ్లతో లాగి ఫంక్షన్ హాలుకు తీసుకువెళ్లారు. అనంతరం జరిగిన వీడ్కోలు సభలో ఆయన్ను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా గజమాలతో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసాద్, అడిషనల్ ఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, సుంకర మురళీమోహన్, పట్టణ సీఐ వీరబాబుతోపాటు ఎస్పీ సీఐలు రాజశేఖర్, శ్రీనివాస్, అంబాజీపేట సీఐ భీమరాజు, అనేక మంది పోలీసు అధికారులు కృష్ణారావు సేవలను ప్రశంసిస్తూ మాట్లాడారు.



బదిలీపై వెళ్లిన ఎస్పీ కృష్ణారావు ఎక్కిన జీపును తాళ్లతో లాగి అమలాపురంలోని ఫంక్షన్ హాలు వద్దకు తీసుకెళ్తున్న పోలీసు అధికారులు



ఎస్పీ కృష్ణారావును సన్మానిస్తున్న ప్రస్తుత ఎస్పీ రాహుల్ మీనా, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్

ఇరుకురోడ్డులో వాహనాలు.. నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు

రావులపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వపాలనలో అభివృద్ధికి నోచుకోని ఇరుకురోడ్డులో నిత్యంవందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఈ రహదారిలో ట్రాఫిక్‌ఇబ్బందులు తప్పడంలేదు. రావులపాలెం మండలం ముమ్మిడివర్రాడు ప్రధానరహదారి గోపాలపురం జాతీయ రహదారి చెంత నుంచి రాజవరం-పొదలాడ, ఈతకోట గంటి రోడ్డువరకూ విస్తరించి ఉంది. పశ్చిమగోదావరి నుంచి వచ్చే వాహనాలు టోల్‌గేట్ తప్పించుకునే క్రమంలో వందలాది వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ పాలనలో గాలికి వదిలేసిన రహదారులను యుద్ధప్రాతిపదికన ఆధునికీకరణ పనులు చేపట్టింది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుండడంతో రహదారి ఛిద్రమైంది. రహదారి చెంతనే ఉన్న వాటర్ పైపులైన్ భారీ వాహనాలు కారణంగా పలుచోట్ల దెబ్బతింటుంది. వర్షం కురిసిన సమయంలో లారీలు రహదారి చెంతన దిగబడిపోయి ఉండిపోవడంతో రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో గ్రామస్థులు కూడా ఈ గ్రామంలోకి రాలేని పరిస్థితి. ఇటీవల ఒక భారీ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిపోయి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం కూడా తప్పింది.



రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు ప్రధాన రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు 'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాలిత మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

లోవకు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.2.21లక్షల ఆదాయం



తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు లోవ క్షేత్రానికి తరలివచ్చారు. వేకువజామునే ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు బారులుతీరిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.2.21 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శరన్నవరాత్రి వేడుకలు

సోమవారం నుంచి జరగనున్న శరన్నవరాత్రి వేడుకలకు లోవ దేవస్థానం సిద్ధమైంది. 11రోజులపాటు తలుపులమ్మ అమ్మవారు 11 అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం నుంచి వివిధ అలంకరణలో దర్శనమివ్వనున్నారు. 22న శ్రీబాలాత్రిపుర సుందరిగా, 23న శ్రీగాయిత్రిదేవిగా, 24న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 25న శ్రీకాత్యాయని దేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న శ్రీలలితాదేవి, 28న శ్రీమహా చండీదేవిగా, 29న శ్రీసరస్వతిదేవిగా (మూలా నక్షత్రం), 30నశ్రీదుర్గాదేవిగా, అక్టోబరు1న శ్రీమహిసాసురమర్ధిని దేవిగా, 2న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు దర్శనం ఇస్తారు.

నేటి నుంచి విజయదుర్గా పీఠంలో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



రాయవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో గాడ్ కుమార్తె సత్యవెంకట కామేశ్వరి చేతుల మీదుగా ఉదయం 8.16గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. తొలుత అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు ప్రత్యేక అలంకరణ జరిపి అర్చనలు, హారతులు ఇవ్వనున్నారు. భక్తులతో అమ్మవారికి సామూహిక శ్రీచక్ర కుంకుమార్చన జరిపిన అనంతరం మహా నివేదన జరిపి భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం భాగవత పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం, సువాసినీల పూజ, అమ్మవారికి కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన చతుర్వేద స్వస్తి, దర్బార్‌సేవ జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నారు. భక్తులు ఈవేడుకల్లో పాల్గొనాలని అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు కోరారు.

వెంకన్న ఆలయంలో భక్తజన సందడి



వాడపల్లి ఆలయంలో భక్తుల పూజలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వేకువజామునే స్వామివారికి ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం, నివేదన, గోపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.

మైనార్టీ పాఠశాలలకు 27 నుంచి దసరా సెలవులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మైనార్టీ పాఠశాలలకు ప్రభుత్వ అకడమిక్ కేలండర్ ప్రకారం ఈనెల 27 నుంచి అక్టోబరు 2 వరకూ దసరా సెలవులు పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి అక్టోబరు 3న అన్ని పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలకు ఈనెల 22 నుంచి దసరా సెలవులు ప్రకటించామని, మైనార్టీ పాఠశాలలకు మాత్రం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెలవులు ఇస్తున్నట్టు డీఈవో పేర్కొన్నారు.

అటవీ ప్రాంతాల్లో దసరా పుట్టగొడుగులు



మోతుగూడెం అటవీ ప్రాంతంలో దసరా పుట్టగొడుగులు

మోతుగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో మొలకెత్తుతున్న పుట్టగొడుగులు సేకరణ ద్వారా గిరిజనులకు మంచి ఆదాయం లభించనుంది. చింతూరు మండలం మోతుగూడెం అటవీ ప్రాంతాలలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతం లో సహజ సిద్ధంగా దసరా పుట్ట గొడుగులు మొలకెత్తుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలు వాటిని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాదికి ఒకసారి మాత్రమే సహజ సిద్ధమైన దసరా పుట్టగొడుగులు వస్తుంటా యి. ఎన్నో రకాల మాంసకృతులుం డే ఈ పుట్టగొడుగులకు మంచి డి మాండ్ ఉంది. ప్రతి ఏటా అరకొర గా దొరికే దసరా పుట్టగొడుగులు ఈసారి మా త్రం భారీగా ఉండడంతో మోతుగూడెం ప్రాంత ప్రజలు వీటి సేకరణపై దృష్టి సారించారు. వాటి వల్ల గిరిజనులకు మంచి ఆదాయం కూడా వస్తుంది.

గోకవరంలో వ్యక్తి అనుమానాస్పద మృతి

గోకవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఆదివారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దేవీపట్నం మండలం ఎం.రావిలంక గ్రామానికి చెందిన ఈక నరసింహులుదొర(39) కుటుంబ సభ్యులతో కలిసి ఏడాది నుంచి గోకవరం గ్రామ శివారున సాయిప్రియాంక లేఅవుట్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య గంగవరం మండలంలో సచివాలయం ఉద్యోగిగా పని చేస్తున్నట్టు సమాచారం. నరసింహులు ఆదివారం ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపునాడు కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవిచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో ఆదివారం కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.సమావేశంలో కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం,ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నాయకుడు మజ్జి రాంబాబు, పంతం కొండలరావు, బొమ్ముల దత్తు,అడబాల రామకృష్ణ, కేవీ రామారావు, దేశినీడి రాంబాబు, రుద్రప్రసాద్, కె.చక్కారావు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

బిక్కవోలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ సూచించారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఊళ్లకు వెళ్లేవారు సమాచారం అందిస్తే రాత్రుళ్ల గస్తీ సమయాల్లో ఆ ఇళ్లపై నిఘా ఉంచుతామన్నారు.డబ్బులు, బంగారు వస్తువులను బ్యాంకు లాకర్‌లో ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్దపెద్ద కంపెనీలు పండుగ ఆఫర్‌లు ఇచ్చినందున ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడీ క్రియేట్ చేసి ప్రజలను మోసం చేసే ప్రమాదముందని, తెలియని ఆన్‌లైన్ లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని ఎస్ఐ సూచించారు.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

ఘనంగా ప్రారంభమైన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ బయాథలాన్ చాంపియన్‌షిప్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథి, మోడ్రన్ పెంటాథ్లాన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథి, డీఎస్డీవో శ్రీనివాసకుమార్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మోడ్రన్ పెంటాథ్లాన్ అనేది ఒలింపిక్ గేమ్ అని, ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దీనిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి 'శాప్'లో భాగస్వామి చేసిందన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు చాలా దృఢంగా తయారవుతారన్నారు. ఇక్కడి ఈవెంట్లో మెడల్స్ సాధించిన వారు త్వరలో ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలుగా నిలిచిన వారు దక్షిణాఫ్రికాలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. డీఎస్డీవో శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ గ్రౌండ్‌లో ఈ గేమ్ నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు ఆర్.హరిబాబు, జిల్లా కార్యదర్శి బీఎస్ఎస్ కుమారి, జిల్లా కోచ్ కట్టా జగన్‌మోహన్ కిషోర్, అలయన్స్ సౌత్ మల్టిపుల్ ట్రెజరర్ వనుం శ్రీనివాస్, ఏవీవీ సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వి.మాచరరావు, పీఈటీల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ బీఎస్‌వీఎస్ఎస్ ప్రసాద్, వనుం ఉపేంద్రనాథ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిమ్నాస్టిక్స్‌లో విన్యాసాలు చేస్తున్న క్రీడాకారిణి

దసరా ఉత్సవాలకు ముస్తాబైన పాదగయ



పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి

- నేటి నుంచి శరన్నవరాత్రి, శత చండీ యాగ మహోత్సవాలు
- 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు
- భారీగా తరలిరానున్న భక్తులు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దక్షిణ కాశీగా, శక్తి పీఠంగా విరాజిల్లుతూ స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి కొలువైఉన్న కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబైంది. ఈ సమయంలో అమ్మవార్లను దర్శించుకుని కుంకుమ పూజలు చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తారు. ఇందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక పూజలు..

పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి చెంతన ఆదిశంకరాచార్యతో ప్రతిష్ఠితమైన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవత పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర, శత చండీ యాగ మహోత్సవాలు సోమవారం ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2 వరకు జరిగే నవరాత్రుల్లో రాజరాజేశ్వరి అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ మహా గణపతిస్వామికి విఘ్నేశ్వర పూజ, దత్తాత్రేయస్వామి, కుక్కుటేశ్వర స్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం సామూహిక విశేష కుంకుమార్చనలు, ప్రత్యేకార్చనలు, మహానివేదన, చతుర్వేద స్వస్తి, దర్బారు సేవ జరుగుతాయి. పురుహూతికా అమ్మవారి శరన్నవరాత్ర శత చండీ యాగంలో భాగంగా ప్రతిరోజూ విఘ్నేశ్వర పూజ, శత చండీ యాగ సంకల్పం, చండీపారాయణలు, రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చన, స్వాములకు అభిషేకాలు, పురుహూతికా అమ్మవారికి శ్రీచక్ర నవావరణార్చనసహిత ప్రత్యేక సహస్ర పుష్పార్చనలు, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన, చండీయాగం, సాయంకాల సహస్ర పుష్పార్చనలు జరుగుతాయి. అక్టోబరు 2న మధ్యాహ్నం మహా పూర్ణాహుతి జరుగుతుంది.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

పాదగయలో సోమవారం నుంచి జరిగే శరన్నవరాత్ర, శతచండీయాగ మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశాం. స్వామి, అమ్మవార్ల దర్శనాలు, కుంకుమ పూజలు నిమిత్తం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. సులభతరంగా దర్శనాలు అయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఉత్స వాల్లో భాగంగా 11 రోజులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేస్తారు. పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న భక్తులకు జల్లు స్నానాలు ఏర్పాట్లు చేశాం. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తరించాలని కోరుతున్నాం.



కాట్నం జగన్మోహనశ్రీనివాస్, ఈవో, పాదగయ

అమ్మవార్లకు పట్టు చీరలు పంపిన పవన్

రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు దసరా శరన్నవరాత్రుల సమయంలో అలంకారాలు చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టు చీరలు పంపారు. ఏటా జరిగే ఉత్సవాల సమయంలో స్థానిక ఎమ్మెల్యే పట్టుచీరలు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. దీనికి అనుగుణంగా పవన్‌కల్యాణ్ తన సొంత ఖర్చుతో 22 చీరలు కొనుగోలు చేసి పాదగయ క్షేత్రానికి పంపి ఈవోకు అందజేశారు.

అలంకారాలు...

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రతిరోజూ ఒక అలంకారం చేస్తారు. 22న రాజరాజేశ్వరి, 23న బాలాత్రిపుర సుందరి, 24న అన్నపూర్ణాదేవి, 25న గాయత్రీ దేవి, 26న లక్ష్మీదేవి, 27న కాళికాదేవి, 28న సరస్వతీదేవి, 29న దుర్గాదేవి, 30న మహిషాసురమర్దిని, అక్టోబరు 1న విజయదుర్గాదేవి, 2న విజయదశమి రోజున రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. విజయదశమి పర్వదినాన సాయంత్రం ఆరు గంటల నుంచి శమీ పూజ, పాదగయ పుష్కరిణిలో హంసవాహనంపై అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతాయి.

నేటి నుంచి మహాశక్తి యాగం

శ్రీపీఠంలో అక్టోబరు 3 వరకు నిర్వహణ



మహా శక్తి యాగానికి సిద్ధమైన ప్రాంగణం

సర్పవరం జంక్షన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం లో 11 రోజుల పాటు జరిగే 3వ మహాశక్తి యాగం-2025 నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. దేవీ శరన్నరాత్రుల్లో భాగంగా శ్రీపీఠం వ్యవస్థాపకుడు స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆలయం వెనుక గల మహాశక్తి యాగం ప్రాంగణంలో సోమవారం నుంచి అక్టోబరు 3 వరకు వంద కోట్ల లలితా సహస్ర నామ కుంకుమార్చన మహా క్రతువు నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. నిత్యం సుమారు 30వేల మందికి పైగా భక్తులు కూర్చునేలా భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 120 మంది రుత్వికులు, సుమారు 3వేల మంది సేవకులు ఇప్పటికే శ్రీపీఠానికి చేరుకున్నారు. కుంకుమార్చన జరిగే 11 రోజుల్లో ఉదయం సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్నం వేలాది మందికి అన్న ప్రసాదం తయారీకి ప్రత్యేక వంటల మాస్టర్లు, సిబ్బంది వచ్చారు. మధ్యాహ్న భోజనానికి సుమారు 70 కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు ఐశ్వర్యాంబిక అమ్మవారికి పూజతో సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ, సహస్ర రుద్ర, మహా రుద్ర హోమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు లలితా సహస్రనామ కుంకుమార్చన జరుగుతుంది. యాగంలో పాల్గొనే భక్తులకు ఇప్పటికే ప్రత్యేక ఐడీ కార్డులు జారీ చేశారు. 11 రోజులు కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు అమెరికాకు చెందిన దాత సహకారంతో స్వచ్ఛమైన రాగితో తయారు చేయించిన ఐశ్వర్య కంకణాన్ని చివరి రోజున అందజేస్తారు. యాగం బందోబస్తు ఏర్పాట్లను కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో పర్యవేక్షణలో సర్పవరం ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. సుమారు 50 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

జమిలి ఎన్నికలు దేశ ప్రగతికి దోహదం

ఒకే దేశం-ఒకే ఎన్నికపై సమావేశంలో న్యూఢిల్లీ ఎంపీ బాన్సూరి స్వరాజ్

పాల్గొన్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న బాన్సూరి స్వరాజ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమిలి (ఒకే దేశం-ఒకే ఎన్నిక) ఎన్నికల నిర్వహణ సంక్లిష్టమైనా విజయవంతంగా నిర్వహిస్తే ప్రజాస్వామ్యానికి ఐదేళ్ల పండుగలాంటిదని, దేశ ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందని న్యూఢిల్లీ పార్లమెంట్ సభ్యురాలు బాన్సూరి స్వరాజ్ అన్నారు. గోదావరి ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో ఒన్ నేషన్-ఒన్ ఎలక్షన్‌పై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా బాన్సూరి స్వరాజ్ మాట్లాడుతూ విడివిడిగా ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల వ్యయం పెరుగుతుందని, దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడుతుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం అర్థరహితమన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జమిలి ఎన్నికలకు జనసేన పరంగా ఇప్పటికే పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ మద్దతు తెలిపారని.. అయితే ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయ సమస్యల ప్రస్తావనకు ఇబ్బందిలేకుండా చూడాల్సి ఉందన్నారు. ముఖ్యంగా రాజకీయ, పరిపాలనాపరమైన సంస్కరణలు తెచ్చాక జమిలి ఎన్నికలకు వెళితే మంచిదని, లేకుంటే దుష్ఫలితాలు వచ్చే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఒకే దేశం-ఒకే ఎన్నిక అనేది కొత్త విషయం కాదని, 1967 వరకూ దేశంలో ఇదే విధానం ఉండేదన్నారు. అమెరికా, బ్రెజిల్, బెల్జియం, స్వీడన్ వంటి దేశాల్లోనూ జమిలి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదం వస్తుందా, జాతీయ సమస్యలు తప్ప ప్రాంతీయ సమస్యలు పట్టించుకోరా అనే అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేస్తూ ఏకాభిప్రాయం సాధించడానికి ఇలాంటి సమావేశాలు దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ జమిలి ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరగాలని, ఎన్నికల వ్యయం, సమయం ఆదా అవుతాయన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక కార్యక్రమం రాష్ట్ర కన్వీనర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడారు. జమిలి ఎన్నికల నిర్వహణపై వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఎంపీ బాన్సూరి స్వరాజ్ సమాధానాలిచ్చారు. ఫోరమ్ తరపున శివనాగరాజు, స్వర్ణ రజని, శివరామకృష్ణంరాజు, రవిశంకర్ పర్యవేక్షించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

● నలుగురు నిందితుల అరెస్ట్ ● 3.174 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అదుపులోకి తీసుకున్న కరప పోలీసులు

కరప, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జడ్.భావారం గ్రామంలో గంజాయి ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి 3.174 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 20న గ్రామానికి చెందిన గుణ్ణం రాజశేఖర్ ఇంటి వద్ద కొంతమంది వ్యక్తులు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారం మేరకు ఎస్ఐ సునీత, తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్, వీఆర్వో, ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిందితుడు రాజశేఖర్ పెదపూడి మండలానికి చెందిన వెన్నపు లక్ష్మీగణపతి అలియాస్ గణేష్‌కు డబ్బులు ఇచ్చి కిలో గంజాయి తీసుకురావాలని పురమాయించాడు. అయితే తన వద్ద లేదని, తన స్నేహితుడు వాసంశెట్టి బన్ని ద్వారా తెప్పిస్తానని మాట ఇచ్చాడు. రామచంద్రపురంలో ఉంటున్న చెల్లూరి మణికంఠ అలియాస్ లడ్డు అనే వ్యక్తి వద్ద బన్ని 3 కిలోల గంజాయి తీసుకుని రాజశేఖర్ ఇంటికి వచ్చాడు. రాజశేఖర్, గణేష్, బన్నిలతో పాటుగా సత్య అనే వ్యక్తి తెచ్చిన గంజాయిని పంచుకుంటుండగా పోలీసులు మెరుపు దాడి చేసి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారికి గంజాయి సప్లై చేసిన చెల్లూరి మణికంఠ పరారీలో ఉన్నాడు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజశేఖర్ ఒక దినపత్రికలో రిపోర్టర్‌ని అని చెప్పి ప్రజలను మోసం చేస్తూ గణేష్ అనే నిందితుడి నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో విక్రయిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఏ3 వాసంశెట్టి బన్నీపై రామచంద్రపురంలో ఒక గంజాయి కేసు ఉన్నట్టు చెప్పారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిందితులను కాకినాడ కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ అక్టోబరు 3 వరకు వారికి రిమాండ్ విధించినట్టు కరప పోలీసులు తెలిపారు. గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన కరప పోలీసులను పలు గ్రామాల ప్రజలు అభినందించారు.

ఆర్థిక లావాదేవీలే ప్రధాన కారణం...

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లావ్యాప్తంగా సంచలనం కలిగించిన గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగిన జంట హత్యలు, మరొకరిపై హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆర్థిక లావాదేవీలే ఇందుకు కారణమని గుర్తించారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు.

అసలేం జరిగింది..?

గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన రంపం గంగాధర్ తన బంధువులైన రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబు, స్నేహితుడైన కుంపట్ల సూరిబాబు(బాబ్జీ) వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని కొంత కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గంగాధర్ తన బంధువులైన శ్రీనివాస్, సూరిబాబును ఫ్రైడ్ రైస్ పార్టీ ఇస్తానని చెప్పి పిలిచి ఈనెల 16న రాత్రి 8గంటల సమయంలో మొగలి చిన్నకు చెందిన పొలంలోని నూతి వద్దకు తీసుకువెళ్లాడు. నూతి గట్టుపై కుర్చొని ఫ్రైడ్ రైస్ తింటుండగా వారిద్దరినీ గంగాధర్ నూతిలోకి తోసి హత్య చేశాడు. అనంతరం స్నేహితుడైన కుంపట్ల సూరిబాబు ను టీ తాగడానికి గొల్లప్రోలు వెళ్లి వద్దామని పిలిచి తాటిపర్తి రోడ్డులోని సుద్దగడ్డ కాలువ వద్దకు తీసుకువెళ్లి సెల్‌ఫోన్ పడిపోయిందని చెప్పి వెతుకుతున్నట్టు నటించాడు. సూరిబాబును కాలువలోకి తోసి గంగాధర్ చంపడానికి ప్రయత్నించగా అతడు తప్పించుకుని పారిపోయాడు. 17న ఉదయం విషయం బంధువులకు తెలియజేయడంతో వారు వెళ్లి చూడగా మృతదేహాలు లభించాయి. ఈ ఘటనపై రంపం శివదుర్గ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాదవ్, ఏఎస్పీ మనీష్‌దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలతో నాలుగు బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడుగా ఉన్న రంపం గంగాధర్ విశాఖపట్టణం పారిపోయి డబ్బులు అయిపోవడంతో తన మోటార్ సైకిల్ తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుని దూరంగా వెళ్లిపోయేందుకు పిఠాపురం రైల్వేస్టేషన్‌కు రాగా అతడిని అరెస్టు చేశారు. శ్రీనివాస్, సూరిబాబు నూతి లోకి తోసేయడం వల్లే చనిపోయారా, ఆహార పదార్థాల్లో ఏమైన విష పదార్థాలు కలిపారా అన్నది పోస్టుమార్టం పూర్తి నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తుందని చెప్పారు. ఈ సంఘటనకు ఆర్థిక లావాదేవీలే కారణమన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

కూళ్లలో బంగారు ఆభరణాల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలన చేస్తున్న ఎస్ఐ జానీబాషా

కె.గంగవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు చిట్టూరి అనంతలక్ష్మి సత్యవతి నూతనంగా గృహం నిర్మించుకుంటుంది. ప్రస్తుతానికి గ్రామంలో మండువా లోగిలిలో అద్దెకు ఉంటుంది. అక్కడ నుంచి నూతన గృహం నిర్మాణ పనులు చూసుకుంటుంది. శనివారం మధ్యాహ్నం అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి గృహ నిర్మాణం పనులు చూసుకోవడానికి వచ్చింది. తిరిగి రాత్రి ఇంటికి వెళ్లేసరికి సుమారు 145 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భార్యను హింసించిన భర్త అరెస్ట్

కె.గంగవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఊడిమూడికి చెందిన పంచగంగి బేబికి ఏ.వేమవరానికి చెందిన రామకృష్ణతో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల రామకృష్ణ మద్యానికి బానిసై కుటుంబ పోషణ కూడా మరిచాడు. దీనిపై భార్య బేబి ప్రశ్నించిందని హింసించాడు. బేబి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు నమోదు చేసి రామకృష్ణను అదుపులోకి తీసుకున్నామని పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా తెలిపారు.

నేటి నుంచి రత్నగిరిపై దసరా ఉత్సవాలు

సాయంత్రం 6.30 గంటల నుంచి అంత్రాలయ దర్శనాలు నిలుపుదల : ఈవో

అన్నవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రరక్షకిలు అయిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. సోమవారం ఉదయం 8గంటలకు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. పండితులకు దీక్షా వస్త్రదారణ, జపములు, సూర్యనమస్కారములు, మహాలింగార్చన తదితర కార్యక్రమాలతో పాటుగా అక్టోబరు 2 వరకు కుంకుమపూజలు నిర్వహిస్తారు. దసరా ఉత్సవాలు జరిగే రోజుల్లో ప్రతినిత్యం సాయంత్రం 6.30 గంటల నుంచి 8గంటల వరకు అంత్రాలయ దర్శన టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేస్తామని, భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.50001, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.50001ను బాపట్లకు చెందిన కుర్రా పూజ్యశ్రీత ఆదివారం విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేయగా అభినందించి స్వామి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ముమ్మరంగా వాహనాల తనిఖీ



మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మోతుగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి 27 వరకు మావోయిస్టులు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఆంధ్ర - ఒడిశా సరిహద్దుల ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏవోబీలో పోలీసులు బలగాలను మోహరించి గాలింపు చేస్తున్నారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో ఒడిశా నుంచి మోతుగూడెం మీదుగా రాజమండ్రి, తెలంగాణ ప్రాంతంలో వెళ్లే వాహనాలను మోతుగూడెం ఎస్ఐ సాదిక్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ ఏ/42 బెటాలియన్ ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి ఆ తర్వాత పంపుతున్నారు.

ఆర్టీసీ నైట్ సర్వీస్ రద్దు

మావోస్టులు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుంచి 27 వరకు ఏజెన్సీలో ఆర్టీసీ నైట్ సర్వీసులు రద్దు చేశామని ఆర్టీసీ విశాఖపట్నం డిపో మేనేజర్ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి మోతుగూడెం మీదగా భద్రాచలం వెళ్లే అంతర్‌రాష్ట్రీయ సర్వీసులు నిలిపివేశామని, 28 నుంచి నైట్ సర్వీసులు తిరిగి ప్రారంభిస్తామన్నారు.

అమ్మో.. ఆరడుగులే!



తాచుపామును బంధిస్తున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

ముమ్మిడివరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొమానపల్లిలోని కావూరి రామకృష్ణ ఇంటి ఆవరణలోని డొక్కాల గూడులో ఆదివారం తాచుపాము హల్‌చల్ చేసింది. ఆరు అడుగుల తాచుపాము హల్‌చల్ చేయడంతో ఇంటి యజమాని, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో పామును చాకచక్యంగా బంధించాడు.




చెరువు చూడతరమా... యానాం గిరియాంపేటలో గ్రాంటు సమీపంలోని చెరువులో తామర పుష్పాలు ఇలా కనువిందు చేశాయి. - యానాం (ఆంధ్రజ్యోతి)

చేపల వేట.. చాలా సులభమట!



అమీనబాద్ ఉప్పుటేరు పాయలో చేపలు పట్టి తీసుకెళ్తున్న దృశ్యాలు





- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ-అమీనబాద్ తీరప్రాంతాల్లో ప్రస్తుతం మత్స్యకారులకు చేపలు లభ్యం కాకపోవడంతో ఉప్పుటేరుపాయలో సులువుగా చేపలను పట్టుకుంటున్నారు. దీనికి పెట్టుబడి కేవలం ఖాళీ డ్రింకు బాటిళ్లు, కిలో మైదా పిండి మాత్రమే. 2 లీటర్ల బాటిల్ అడుగుభాగం కట్ చేసి పైన తాళ్లతో చిక్కం మాదిరిగా తయారు చేసి నీళ్లతో కలిపిన మైదా పిండిని నింపి ఉప్పుటేరు పాయలో విసురుతున్నారు. క్షణాల్లో చేప బాటిల్‌లోని మైదా కోసం రాగానే బాటిల్ పైగా లాగేచయడంతో చేపలు చిక్కుతున్నాయి. కిలో, 2 కిలోల కట్టచేపలు దొరుకుతున్నాయి. వీటిని మార్కెట్లో విక్రయిస్తూ మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ద్రాక్షారామ, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శ్రీవీవీఆర్ ఉన్నత పాఠశాలలో 1978-79 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ద్రాక్షారామంలోని సాయిమాధవానంద ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు శ్రీమన్నారాయణ దంపతులు, చెరుకు సూర్యనారాయణ దంపతులను ఘన సన్మానం చేశారు.

ర్యాలిలో అన్నసమారాధన

ఆత్రేయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ర్యాలి మెర్లవీధిలోని కొత్త రామాలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది గ్రామస్థులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- విద్యుత్ దీపాలతో ఆలయాలు అలంకరణ
- గ్రామాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు





మామిడికుదురు: పెదపట్నంలంకలో కనకదుర్గ అమ్మవారు, పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు, అంబాజీపేటలో భేతాళస్వామి

ముమ్మిడివరం,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవిశరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుపూర్తి చేశారు. సోమవారం నుంచి అక్టోబరు 2వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గ్రామాల్లో దేవీ ఆలయాల వద్ద పెద్దపెద్ద చలువ పందిళ్లువేసి విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలను నిలిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ ముఖ్య కూడళ్లలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్నిఏర్పాట్లు పూర్తిచేసింది. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్, గోదశివారిపాలెం, రాజుపాలెం క్రాపచింతలపూడి, అయినాపురం, సోమిదేవరపాలెం, లక్ష్మీదేవిలంక, కర్రివానిరేవు, రాణేలంక, గేదెల్లంకగ్రామాల్లో కనకదుర్గమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అమ్మవారిని ప్రతీరోజు ప్రత్యేక అలంకరణలతో పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. విగ్రహాల తయారీకి ప్రసిద్ధి చెందిన గాడిలంకగ్రామంలో కనకదుర్గమ్మవారి ఉత్సవవిగ్రహాలు రూపుదిద్దుకున్నాయి.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి ఉత్సవాలు నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. పెదపట్నంలంక గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం ఉదయం 7.48 గంటలకు ఉత్సవాల నిర్వహణకు కలశ స్థాపన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో విజయదశమి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రతీ రోజు శ్రీచక్రార్చన, పంచామృతాలతో అభిషేకం, సామూహిక కుంకుమార్చనలు, శ్రీమహాలక్ష్మి యాగం, లలిత సహస్ర పారాయణం, అమ్మవారికి విశేష అలంకరణలు జరుగుతాయని ఏసీ తెలిపారు. పాశర్లపూడిబాడవ, మగటపల్లి శ్రీశక్తి పీఠం, మామిడికుదురు విజయదుర్గమ్మ ఆలయాల వద్ద ఉత్సవాలను ఘనంగా సోమవారం నుంచి ప్రారంభించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు ముస్తాభయ్యాయి. పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం కలశస్థాపనతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు పుల్లేటికుర్తి ఫణి తెలిపారు. పి.గన్నవరం, గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి తొమ్మిది రోజులు ఉత్సవాల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. దేవీ ఆలయాలను విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీ, వాడపర్రు, గొల్లవిల్లి, కూనవరం, చల్లపల్లి, ఎస్.యానాం, ఉప్పలగుప్తం, చినగాడవిల్లి, సన్నవిల్లి, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి, విలసవిల్లి, నంగవరం, భీమనపల్లి తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులు చండీ హోమాలు, కుంకుమ పూజలు, నిత్యాలంకరణలు, అన్నసమారాధనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దశమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తారు. అమ్మవార్కి ప్రతిరోజు విశేష అలంకరణ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో ఉన్న శ్రీవిజయభేతాళస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం మోహనరావు తెలిపారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం శంకరగుప్తంలో రూ.42లక్షలతో నిర్మించే రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో రూ.3.10కోట్ల అంచనాలతో నాలుగు ఆర్అండ్‌బీ రోడ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. శంకరగుప్తం, మగటపల్లి, శివకోటి, దిండి, రామరాజులంక రోడ్లను ఈనిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. బట్టేలంక, శంకరగుప్తం మధ్య వంతెన శిథిలమైందని, గతంలో ఈ వంతెన నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు కాగా ఆ నిధులు రద్దయ్యాయన్నారు. ప్రస్తుతం శంకరగుప్తం రోడ్డు పెద్దపెద్ద గోతులు పడడంతో తాత్కాలికంగా రూ.42లక్షలతో బాగు చేస్తామని, మళ్లీ వంతెన నిర్మాణానికి ఇరువైపులా అప్రోచ్ రోడ్లకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల యుగంధర్, ముదునూరి చినబాబు, సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, ఆచంట మాణిక్యం, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, మంగెన నాని, ముప్పర్తి నాని, గుబ్బల ఫణి, రావూరి నాగు, శిరిగినీడి నాని, ఉంగరాల బాలాజీ, చాగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.



మలికిపురం: శంకరగుప్తంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

మామిడికుదురు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని అధ్వానంగా తయారైన రహదారుల నిర్మాణానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మగటపల్లిలో ఎండీఆర్ నిధులు రూ.60లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. మగటపల్లి నుంచి మోరిపోలం వరకు ఈరోడ్డును నిర్మిస్తారన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని రోడ్లను ఆధునీకీకరించి ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్టు తెలిపారు. జడ్పీమాజీ చైర్మన్ నామన రాంబాబు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి జదీష్, బొలిశెట్టి జయరామ్, టీడీపీ మండలశాఖ మొల్లేటి శ్రీనివాస్, బీజేపీ మంలాధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెగా వైడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.30లక్షల సాయం



బందారులంకలో పేరి శ్రీనివాసశర్మను సత్కరిస్తున్న శంకరమూర్తి–సునీత తదితరులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు భవనాల నిర్మాణం కోసం మెగా వైడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 లక్షలు నిధులు మంజూరు చేసింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటిలో(సీఎస్ఆర్) భాగంగా నిధులు మంజూరుకు గ్రామానికి చెందిన పేరి శ్రీనివాస శర్మ చేసిన కృషిని అభినందిస్తూ ఆదివారం శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతాశంకర మూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత-ఏడుకొండలు, పిచ్చిక వెంకన్న తదితరులు శాలువాలు కప్పి సత్కరించారు. సంస్థ పంపించిన మంజూరు లేఖను పాఠశాల హెచ్ఎం ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందజేశారు.

ప్రశాంతంగా వీఏవో రాత పరీక్ష

యానాం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (వీఏవో) పోస్టుల ఎంపికకు ఆదివారం జరిగిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. యానాంలో ఆరు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,919మంది అభ్యర్థులకు 1,461మంది హాజరయ్యారు. రాత పరీక్షకు పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులతో పాటు యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ పర్యవేక్షించారు.

కోటిపల్లి వీఆర్వోగా స్వామినాయుడు

కె.గంగవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామ వీఆర్వోగా కొమ్ముల స్వామి నాయుడును డిప్యూటేషన్‌పై నియమించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

గుంటూరులో 25న యూటీఎఫ్ రణభేరి సభ



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి సుబ్బారావు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు, వివిధ అంశాలపై యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాల స్థాయిలో యూటీఎఫ్ రణభేరి జాతా విజయవంతమైందని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈనెల25న గుంటూరు శ్రీవెంకటేశ్వరా విజ్ఞాన మందిరం ఆవరణలో యూటీఎఫ్ రణభేరి సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని రణభేరి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అకడమిక్ విధానాలపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు అయినా డీఏ బకాయిలు చెల్లించలేదని, మధ్యంతర భృతి ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రణభేరి సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రోహిత్ ఎంపిక



రాజోలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా పిఠాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో శివకోడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బొలిశెట్టి రోహిత్‌కుమార్ అండర్-19 విభాగం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ తెలిపారు. రోహిత్‌కుమార్‌ను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మహిళకు నివాసం ఏర్పాటు

యానాం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యానాం కమలనెహ్రూ బాలికల పాఠశాల సమీపంలో నిరాశ్రయులైన మందపాక లక్ష్మికి ఆదివారం తోట రాజు నివాసం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా తోట రాజుకు లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గురజాడ జయంతి

రాజోలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో కవి శేఖరుడు గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి పి.శైలజ, కోఆర్డినేటర్ డాక్టర్ వీవీ చంద్రబోస్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ పి.లావణ్య, ఆంగ్ల అధ్యాపకులు ఎస్.రాజు, అశ్వినీరెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు ఉమాశంకర్, నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సముద్రం ముంపుబారిన పడుతున్న కొబ్బరి తోటలను

డిప్యూటీ సీఎం పరిశీలిస్తాననడం శుభపరిణామం: శ్రీనివాస్

రాజోలు, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సముద్రం నీరు చేరి పాడైన కొబ్బరి తోటలను దసరా తరువాత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిశీలిస్తాననడం శుభ పరిణామమని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. రాజోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ వెంబడి ఉన్న గ్రామాల్లోని కొబ్బరి తోటల్లోకి సముద్రం నీరు చేరడంతో కొబ్బరి చెట్లు తలలు వాల్చేసి వేల ఎకరాలు దెబ్బతిన్న విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తీసుకువెళ్లారన్నారు. దసరా తర్వాత ఇక్కడకు పవన్‌కల్యాణ్ వస్తారని చెప్పడం మంచి విషయమన్నారు. కొబ్బరి తోటలను పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు: ఎమ్మెల్యే

ఐ.పోలవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. జి.వేమవరం పీహెచ్‌సీ పరిధిలో రూ.33లక్షలతో నిర్మించే బ్లాక్ హెల్త్ యూనిట్‌కు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఆసుపత్రి సముదాయంలో నిర్మించే బ్లాక్ వల్ల ల్యాబ్ టెస్టులు చేయడానికి వీలు కలుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ మండల అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, గుత్తెనదీవి సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు, సొసైటీ చైర్మన్లు పెంట రవిప్రసాద్, చిక్కాల శ్రీనివాస్, నీటిసంఘం అధ్యక్షులు సాగి వాసురాజు, పెద్దిరెడ్డి శ్రీనివాస్, కొప్పిశెట్టి గణేష్, సంఘాని వీరబాబు పాల్గొన్నారు.

బ్లాక్ హెల్త్ యూనిట్ భవనానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పీహెచ్‌సీపరిధిలో బ్లాక్ హెల్త్‌యూనిట్ నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.33లక్షలతో నిర్మించే హెల్త్‌యూనిట్‌లో హెల్త్‌టెస్టులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీరాష్ట్రకార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, నడింపల్లి సుబ్బరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు చెల్లి సురేష్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీనివాసరావు, వనచర్ల నాగేశ్వరరావు, మాదే యోగీశ్వరి, మోకా బాలప్రసాద్, బండారు ఏసుబాబు, వాసంశెట్టి రాజేశ్వరరావు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే జైలుకే

పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రుద్రరాజు

అంబాజీపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, తీరుమార్చుకోకపోతే జైలుకు పంపిస్తామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు హెచ్చరించారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్కిల్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు ఎక్కడైనా రాత్రి ఏడు గంటల తరువాత కనిపిస్తే పీడీ యాక్టు ఓపెన్ చేసి జైలుకు పంపిస్తామన్నారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐలు కె.చిరంజీవి, చైతన్యకుమార్, శివకృష్ణ పాల్గొన్నారు.

అధ్వానంగా హాస్టల్ రహదారి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఈఅంశంపై అధికారులకు వినతులు సమర్పించినా స్పందన లేదని వాపోతున్నారు. తాజాగా ఈఅంశాన్ని మాజీ సర్పంచ్, హాస్టల్ స్థల దాత కుటుంబ సభ్యుడు అరిగెల నానాజీ శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారికి వివరించారు. హాస్టల్ వార్డెన్‌తో పాటు ఉన్నతాధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు హాస్టల్ వద్దే దుస్తులు ఉతుక్కుంటున్నారని, రహదారిని బహిర్భూమిగా వాడుకుంటున్నారని గ్రామస్తులు వాపోయారు. హాస్టల్ సంక్షేమాధికారిణి కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

మామిడికుదురు, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మగటపల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ సేవలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ బొలిశెట్టి జగదీష్, కాట్రేనిపాడు నాగేంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

మామిడికుదురు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని కొమరాడ గ్రామస్తులు పేర్కొన్నారు. కొమరాడ గ్రామసచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్.. కొబ్బరి చెట్టు దగ్ధం

అల్లవరం, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు తీరగ్రామంలో చొల్లంగి రాధాకృష్ణ స్వగృహం వద్ద ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు కొబ్బరి చెట్టు అంటుకుని మంటలు చెలరేగాయి. కొబ్బరి చెట్టుకు ఆనుకుని విద్యుత్ వైర్లు వెళ్లడంతో షార్ట్‌సర్క్యూట్‌తో కొబ్బరిచెట్టు దగ్ధమైంది.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాజోలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజోలు యూత్ క్లబ్‌లో పేకాట శిబిరంపై ఆదివారం రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్ దాడి చేశారు. 11మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18,010 నగదు, నాలుగు మోటారుసైకిళ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

అల్లవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడడం వల్ల మానవాళి మనుగడ, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని బీజేపీ నాయకుడు, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర సభ్యుడు రేకాడి సత్యనారాయణవర్మ అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి, నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందని ఓడలరేవు మెరైన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. సముద్ర తీర పరిశుభ్రత వారోత్సవాల సందర్భంగా స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్‌లో భాగంగా అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులు నిర్వహించారు. మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు అంగాడి శ్రీను, అంగాడి ధనుంజయవర్మ, చెక్కా సత్తిబాబు, కొల్లు ఏడుకొండలు, పంతాడి పూరియ్య, ఓలేటి రామస్వామి, కొప్పాడి మహలక్ష్మి, కోలా లక్ష్మి, వాతాడి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

ఆలమూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ హోమంలో పాల్గొనడానికి పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పండితుల వేద మంత్రాల మధ్య ఈ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. హోమం సందర్భంగా భక్తజనం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు వీరి అప్పారావు, వైట్ల శేషుబాబు, గన్ని వెంకట్రావు, విస్సు పండు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

ఆలమూరును 'తూర్పు'లో కలపాలి



మండలాన్ని తూర్పులో కలపాలని నినాదాలు చేస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలాన్ని తూర్పు గోదావరిలో కలపాలని డిమాండ్ చేస్తూ మండల నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జొన్నాడలో ఆదివారం ఆయా పార్టీల నాయకులు సమావేశమై చర్చించారు. ఆల మూరు మండలం రాజమండ్రికి ఆనుకొని ఉందన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆలమూరును తూర్పులో కలపాలని కోరుతూ నాయకులు తీర్మానించారు. తదుపరి సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీని నియమించి అనంతరం ఉద్యమాన్ని ముందుకు నడిపించేలా కార్యాచరణ ప్రకటిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద వ్యవసాయశాఖ ద్వారా రైతులకు మంజూరైన నాలుగు డ్రోన్లను ఎమ్మెల్యేతో పాటు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కపిలేశ్వరపురం మండలానికి ఒకటి, మండపేట మండలానికి మూడు డ్రోన్లు మంజూరు కాగా వాటిని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత నల్లమిల్లి వీరెడ్డి, పాలచర్ల శిరీష్, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, కపిలేశ్వరపురం వ్యవసాయాధికారి బలుసు రవి, మండపేట మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.



రైతులకు మంజూరైన డ్రోన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

వెలగతోడులో ఆర్డీవో అఖిల పర్యటన

మండపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం వెలగతోడులో రామచంద్రపురం ఆర్డీవో అఖిల పర్యటించారు. గ్రామానికి చెందిన వైసీపీ నేత వీరాస్వామి ఫిర్యాదు మేరకు గ్రామానికి వచ్చి దేవుళ్ల తాళ్లకాలనీకి సంబంధించిన రోడ్డును పరిశీలించారు. మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణం కోసం స్థలం సేకరణ సాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. రోడ్డు పక్క చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించి పంచాయతీ కార్యదర్శి వర్మపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ వచ్చేసరికి చెత్త కనిపిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కంపోస్టు యార్డు ఉండగా రోడ్డుపక్క యార్డు సమీపంలో చెత్త ఏమిటని కార్యదర్శిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కంపోస్టుయార్డులో ఆర్డీవో మొక్క నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ తేజేశ్వరరావు, సర్పంచ్ రాజు, పలువురు రెవెన్యూ సిబ్బంది తదితరులు వున్నారు.



వెలగతోడు కంపోస్టుయార్డులో మొక్కను నాటుతున్న ఆర్డీవో అఖిల

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు చంద్రకుమారి

రావులపాలెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి చంద్రకుమారి అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మహిళా విభాగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలపై చంద్రబాబుకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు.

వైసీపీ దిగజారుడు రాజకీయాలు హేయం: మెడికల్ కాలేజీల అంశంపై వైసీపీ చేస్తున్న దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని కొత్తపేట నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాచకొండ సతీష్ అన్నారు. వైసీపీ పాలనలో విద్యావ్యవస్థను సమూలంగా నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు మెడికల్ కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

సహకార సంఘం బలోపేతానికి చర్యలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెలిచేరు కోఆపరేటివ్ సొసైటీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ నాగిరెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం సొసైటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు రైతులకు అందించే రుణాలను రికవరీ చేసి సొసైటీ అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కామేశ్వరశాస్త్రి, వెంకటేశ్వర్లతో పాటు పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మండపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండపేట టౌన్‌హాల్లో రీజియన్ ఆసుపత్రి రాజమండ్రి వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పలు సేవలు అందజేశారు. వైద్యులు వసీమ్ రజాఅన్సారి, నిహల అప్షా, బిల్లాల్ మహ్మద్ షేక్ నిలోఫర్‌లు తమ సేవలను అందించారు. శిబిరంలో పలు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీఎంపీ సంఘ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, మహ్మద్ రహిమ్, ఖరీం, మండిపూడి చంద్రశేఖర్, జగతా రఘువీర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకందారులు నిబంధనలు పాటించాలి

కొత్తపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. దీపావళి సందర్భంగా కొత్తపేటలో నిర్వహిస్తున్న హోల్‌సేల్ బాణసంచా షాపులను ఆయన పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది ఉన్నారు.



కొత్తపేటలో బాణసంచా షాపును పరిశీలిస్తున్న సీఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర

ఎమ్మెల్యేను కలిసిన వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ వెంకట్రాజు

కొత్తపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి దేవస్థానం ఛైర్మన్‌గా నియమితులైన ముదునూరి వెంకట్రాజు(గబ్బర్‌సింగ్) ఆదివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలుసుకున్నారు. ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి మొక్కను అందించారు. వాడపల్లి దేవస్థానం ఛైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.



ఎమ్మెల్యే బండారును సత్కరిస్తున్న వెంకట్రాజు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సుభాష్

కూటమి ప్రభుత్వం..పేదల పక్షపాతి

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అనారోగ్యం పాలైన వారి వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.13.12 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, ఉండవల్లి శివ, మేడిశెట్టి రవికుమార్, కొత్తపల్లి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి: విశ్వ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ర్యాలి రాజశేఖర్, టి.మురళి ఆధ్వర్యంలో విశ్వ బ్రాహ్మణులు మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు దార్ల పాపయ్య, తాళాబత్తుల అప్పలాచార్యులు, కోటిపల్లి కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలు ముస్తాబు

మండపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రులకు అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో భవానీ దీక్షలు చేపట్టేందుకు భక్తజనం శ్రీకారం చుట్టారు. ఆయా ఆలయాలు అమ్మవారి నామస్మరణతో మారుమోగుతున్నాయి. మండపేటతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

పూర్తయిన ఏర్పాట్లు

ఆత్రేయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించారు. సోమవారం నుంచి భవానీ మాలధారణకు ఆయా ఆలయాల వద్ద చర్యలు చేపడుతున్నారు.

రావులపాలెంలో...

రావులపాలెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని నేటి నుంచి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈతకోట జాతీయ రహదారి చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంతో పాటు ఆయా ఆలయాల్లో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆదిరెడ్డి ఈవెంట్స్‌కి టైమ్స్ బిజినెస్ అవార్డు



రాశికన్నా నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం

రావులపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రావులపాలేనికి చెందిన ఆదిరెడ్డి ఈవెంట్స్ ఫెసిలిటేటర్ సంస్థ ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో యంగ్ అచీవర్ పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలో ఎస్ ఎల్వీ గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పలు రంగాల్లో కృషి చేసిన యువ పారిశ్రామికవేత్తలకు అవార్డులను ప్రదానం చేసింది. ఇందులో భాగంగా కార్పొరేట్ ఈవెంట్స్, వివాహాలు, సామాజిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఆదిరెడ్డి ఈవెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.అనిల్‌రెడ్డికి సినీనటి రాశికన్నా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆలమూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ కపిలేశ్వరపురం సమితి యూనిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఆలమూరులో జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా టి.సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎస్‌వీవీఎంపీ.గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సతీష్‌మోహన్, జాయింట్ సెక్రటరీగా కె.వీరేంద్రనాద్, కోశాధికారిగా వైకె.చైతన్య, జిల్లా కౌన్సిలర్స్‌గా రాజేంద్రప్రసాద్, ఎంవీఎం ప్రకాష్‌లను ఎన్నుకున్నారు. జిల్లా పరిషత్ ఎంప్లాయిస్ జిల్లా ఎన్నికల అధికారి భాస్కర్, సతీష్‌ల అధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ అధ్యక్షుడు సురేంద్రరెడ్డితో పాటు ఎన్నికైన కార్యవర్గాన్ని సత్కరించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ద్రాక్షారామ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శ్రీవీవీఆర్ ఉన్నత పాఠశాలలో 1978-1979 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ద్రాక్షారామలోని ఫంక్షన్ హాలులో వారు కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు శ్రీమన్నారాయణ దంపతులు, చెరుకు సూర్యనారాయణ దంపతులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మీనవల్లి వెంకన్న, గంధం మురళీకృష్ణ, బోనం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ర్యాలిలో అన్నసమారాధన

ఆత్రేయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ర్యాలి మెర్లవీధిలోని కొత్త రామాలయం వద్ద ఆదివారం అన్నసమారాధన జరిపారు. గణపతి నవరాత్రి ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.